క్లుప్తంగా

19న స్పాట్ అడ్మిషన్లు

పాన్‌గల్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఖాళీగా ఉన్న సీట్లకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఓ హేమాలత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు నేరుగా విద్యాలయానికి వచ్చి అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

వనపర్తి రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బైపీసీ 5, ఎంపీసీ విభాగంలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఎస్‌ఓ వాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, పదో తరగతిలో మార్కులు ఆధారంగా సీట్లను భర్తీ చేస్తామని ఆమె తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒర్జినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె కోరారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఇంగ్లిష్ మీడియం కస్తూర్బాలో కళాశాలలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుందని ప్రత్యేక అధికారి లలిత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన కంప్యూటర్ సైన్స్‌లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కోర్సులో చేరాలనుకునే విద్యార్థులు 10వ తరగతి మెమో, టీసీ, బోనఫైడ్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తదితర సర్టిఫికెట్ల రెండు జిరాక్స్‌సెట్లతో పాటుగా 5పాస్ ఫొటోలు తీసుకుని సోమవారం కళాశాల దగ్గరకు నేరుగా వస్తే వెంటనే అడ్మిషన్లు ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9505824809 నంబర్‌ను సంప్రదించాలని ఆమె చెప్పారు.

సీసీ నిర్మాణానికి భూమిపూజ



కొత్తకోట: పట్టణంలో ఆరోవార్డులో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి శివగార్డెన్ వరకు రూ.30 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డుకు శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మదనాపురం మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రశాంత్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సీసీ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ప్రజల అవసరాల కోసం, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలకు తరలిరావాలి



వనపర్తి రూరల్: ఆత్మకూర్ పట్టణంలో ఈ నెల 23, 24 న జరిగే సీపీఐ జిల్లా మహాసభలకు పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, పట్టణ కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. శనివారం జిల్లాకేంద్రం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతుఖాతాలో 15 లక్షలు వేస్తామని మోసం చేసిందన్నారు. కార్మికుల కర్షకులు రైతులు ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలేవి పరిష్కారం కాలేదన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా తదితర పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. సభకు కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు వస్తున్నారని తెలిపారు. జిల్లా నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళావతమ్మ, ఎర్రకుర్మన్న, కృష్ణవేణి, లక్ష్మీనారాయణ, వెంకటమ్మ పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

వనపర్తి విద్యావిభాగం: కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశానుసారం జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు ఎక్సైజ్ ఎస్‌ఐ సంధ్యారాణి ఆధ్వర్యంలో టౌన్ ఎస్‌ఐ హరిప్రసాద్, బీసీ సంక్షేమ సహాయ అధికారి ఆంజనేయులు డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రగ్స్‌వల్ల కలిగే అనర్థాలను, పర్యవసనాలపై వివరించారు. కార్యక్రమంలో వార్డెన్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆలయ హంగులకు శ్రీకారం



ఆలయంలో పెరిగిన చెట్లను కొట్టేసిన దృశ్యం

- వేంకటేశ్వరస్వామి గుడికి కొత్త శోభ
- రూ.60 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు
- ఎమ్మెల్యే సొంతంగా గేట్లు ఏర్పాటు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వెలుపల ప్రాంతానికి హంగులు అద్దేందుకు పురపాలక చర్యలు చేపట్టింది. దేదీవ్యమైన ఆలయానికి అనువుగా పరిసర ప్రాంతాలన్ని శోభాయమానంగా మార్చేందుకు పూనుకున్నారు. ఆలయానికి ఇరువైపులా ఆధ్యాత్మికత, ఆహ్లాదకరమైన శోభ ఉట్టిపడేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఈ సంవత్సరం ఫిబ్రవరి 2న, ఆలయంలో అంతర్గత అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.కోటి నిధులు కేటాయించారు. ఆలయంలో ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ వెలుపలి ప్రాంతాలు అధ్వానంగా కనిపిస్తోంది. జిల్లాలో మూడు, నాలుగు ప్రధాన ఆలయాల్లో వేంకటేశ్వర ఆలయం ఒకటి. ఆహ్లాదకరమైన వాతావరణం లేకపోవడంతో వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇరుప్రక్కల నివాసాలు ఉండటంతో అంత చిందరవందరగా ఉండటం, చిన్నపాటి వర్షం కురిస్తే చాలు బురదమయంగా మారుతోంది. ఇదే రీతిలో వినూత్న జాతి కలిగిన వృక్షాలు ఏపుగా పెరిగి కనీసం ఆశించిన స్థాయిలో నిలువ నీడ కూడా ఉండేది కాదు. దీంతో ఆలయంలో హంగులు కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. వరద ఉధృతికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, పేవర్ సీసీ రహదారిని ఏర్పాటు చేయనున్నారు. దీనికితోడు ఆకర్షణీయమైన సైడ్‌లైటింగ్, అరుదైన జాతిపూల మొక్కలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు రహదారిలోని వృక్షాలను శనివారం రోజు అధికారుల ఆదేశాలతో తొలగించారు. ఇందుకోసం టీయూఎఫ్‌ఐడీసీ నుంచి నిధులు కేటాయించారు. అదే విధంగా రెండో ద్వారంగా ఉన్న ప్రాంతం వెలుపలి రహదారిని కూడా ఆలయానికి శోభను చేకూరేలా తీర్చిదిద్దనున్నారు.



అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

సొంత నిధులతో గేట్లు ఏర్పాటు

ప్రస్తుతం రెండు ఇనుపగేట్లు నేటికీ పాతవేకొనసాగుతున్నాయి. వాటి స్థానంలో ఎమ్మెల్యే సొంత నిధులతో 40 అడుగుల పొడవున రెండుగేట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శనివారం అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు బ్రహ్మం, యాపర్ల రామిరెడ్డి, ఎస్‌ఎల్‌ఎన్ రమేష్ కాంగ్రెస్ కార్యకర్తలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు

ఆధ్యాత్మిక అనుభూతి



జిల్లా కేంద్రంలో వేంకటేశ్వరస్వామి ఆలయమే ప్రధానమైనది. వచ్చే భక్తులు వెలుపలి నుంచే ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతూ ఆలయంలోకి వచ్చేందుకు వెలుపలి ప్రాంతాలు అభివృద్ధి చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆలయం వెలుపలి ప్రాంతాలు అభివృద్ధి చేయాలని విన్నవించిన వెంటనే స్పందించి నిధులు కేటాయించారు.

–ఎస్‌ఎల్‌ఎన్ రమేష్

పఠనాసక్తిని పెంపొందించాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. శనివారం మండలంలోని సోళీపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్లము వ్యాఖ్యలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తెలుగు, ఆంగ్లము వ్యాఖ్యలను చక్కగా చదివే విధంగా అలవాటు చేయాలన్నారు. అందుకు వారిలో పఠనాసక్తిని పెంపొందించాలన్నారు. విద్యార్థులతో కలిసిపోయి వారికి పాఠాలు బోధించాలన్నారు. కిందిస్థాయి నుంచి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించినప్పుడే భవిష్యత్తులో వారు ఉన్నతస్థాయికి ఎదుగుతారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈఓ

విలువలతో కూడిన విద్య అందించాలి

వనపర్తిటౌన్: విలువలతో కూడిన విద్యను అందించాలని భారతీయ శిక్షణ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ శివరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం గాయత్రి పాలిటెక్నిక్ కళాశాలలో భారతీయ శిక్షణ మండల్ తెలంగాణ ప్రాంతం సంయుక్త ఆధ్వర్యంలో గురుపౌర్ణమిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మార్కులే కొలమానం కాకూడదని, వినూత్న ఆలోచనలు, సృజనాత్మకత వైపు దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ప్రాథమిక మూలాలను మరిచిపోకుండా దేశ సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవిస్తూ ముందుకుసాగాలన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి శ్రీరామకృష్ణయ్య, తెలంగాణ ప్రాంత అనుసంధాన్ గతివిధి ప్రముక్ డా.సతీష్ రాయికింది, కరస్పాండెంట్ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఉపాధ్యాయుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివరాజ్

నేతన్నల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

అమరచింత,ఆత్మకూర్: నేతన్నల అభ్యునతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని, చేనేత కార్మికులకు నేతన్న భరోసా పథకాన్ని తీసుకొచ్చిందని చేనేత, జౌళిశాఖ ఏడీఏ ప్రియాంక అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కేండేయ ఆలయ ఆవరణలో పథకంపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించారు. మగ్గంపై జియోట్యాగ్ కలిగిన వారికి పథకం వర్తిస్తుందన్నారు. ఇంతకుముందే థ్రిఫ్టుఫండ్ పొదుపు పథకంలో ఉన్నవారికి కూడా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి రామలింగం తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ ప్రియాంక

ఒకవైపు నాటుతారు.. ఇంకోవైపు తొలగిస్తారా..?

వనపర్తి విద్యావిభాగం: వన మహోత్సవంలో భాగంగా ఓ వైపు చెట్లు నాటుతుండగా మరో వైపు పెద్ద పెద్ద వృక్షాలను తొలగించడం ఏమిటని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట 40 ఏళ్ల చెట్టును అనుమతి లేకుండా తొలగించడం నేరం కాదా అన్నారు. వన మహోత్సవం పేరుతో చెట్లు నాటుతున్న నాయకులకు, అధికారులకు ఏ శిక్ష వేయాలో ఎమ్మెల్యే, కలెక్టర్ ఆలోచించాలన్నారు. అదేవిధంగా అప్పాయిపల్లి రోడ్‌లో మాజీ జెడ్పీ చైర్మన్ ఇంటి ఎదుట రోడ్డుపక్కన చెట్లను కరెంట్ వైర్ల క్రింద ఉన్నాయనే నెపంతో చెట్లన్నింటిని కొట్టివేశారన్నారు.



చెట్లను తొలగింపును పరిశీలిస్తున్న నాయకులు

వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు



పరిశుభ్రతను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శశిధర్

ఆత్మకూర్ : పరిశుభ్రతను పాటిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దామని, పట్టణ ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శనివారం స్థానిక పట్టణంలో వార్డుల అధికారులు, కార్మికులతో కలసి 100 రోజుల ప్రణాళికలో భాగంగా ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. నివాసాల పరిసరాల్లో వర్షపునీటితో దోమలు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని డ్రమ్ముల్లో, హౌసుల్లో తదితర వాటిల్లో నీరు నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు ఝాన్సీరెడ్డి, అనూష, మోహన్ తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీల్లో చెత్త వేయొద్దు

వనపర్తిటౌన్: డ్రెయినేజీల్లో చెత్తవేయడంతో దోమలు వ్యాపించి సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా సోకే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి పొడి వ్యర్థాలు, తదితర వాటిపై పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

మందకృష్ణను కలిసిన నాయకులు



కొత్తకోట రూరల్: పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం గద్వాల జిల్లా కేంద్రంలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ కొత్తకోట సమీపంలో సాయి రెస్టారెంట్‌లో విశ్రాంతి తీసుకునేందుకు ఆగాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్, దళిత, బీసీ సంఘాల నాయకులు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి మందకృష్ణను సన్మానించారు. కలిసిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, బోయేజ్, పి.కృష్ణారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్ననాయుడు తదితరులు ఉన్నారు.

గోపాల్‌పేటలో సమస్యలు పరిష్కరించాలి

గోపాల్‌పేట: మండలకేంద్రంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మార్నింగ్‌వాక్‌లో భాగంగా మండల కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను నిలదీశారు. ప్రాథమిక పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని, బీసీ హాస్టల్ కొత్త బిల్డింగు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో టీచర్ సమయానికి రాకపోవడంతో సిబ్బందిని నిలదీశారు. కొంతసేపట్లోనే టీచర్ రావడంతో వారితో ఆలస్యంపై వివరాలు అడిగారు. టైనీటోయిస్ ప్రైవేట్ పాఠశాలలో తరగతి గదులు చిన్నవిగా ఉండడంతో ఎంఈఓ ప్రభాకర్‌ను ప్రశ్నించారు. ఎంఈఓ స్పందిస్తూ పాఠశాలకు నోటీసు అందిస్తామన్నారు. కాగా తహసీల్దార్ కార్యాలయం సందర్శించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజనవిద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్, రాష్ట్ర కార్యదర్శి వీ వీ గౌడ్, పాండురంగ యాదవ్, శ్రావణ్ పాల్గొన్నారు.



టైనీటోయిస్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

'చలో హైదరాబాద్' విజయవంతం చేద్దాం

వనపర్తి విద్యావిభాగం: దివ్యాంగుల హక్కులను సాధించుకునేందుకు ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీగార్డెన్‌లో నిర్వహించిన చలో హైదరాబాద్ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు రూ.6వేలు ఇతర చేయూత పెన్షన్లు రూ.4వేలు, తీవ్ర వైకల్యం, కండరాల క్షీణత వారికి ఏపీ రాష్ట్రంలో ఇస్తున్నట్టుగా రూ.15వేలు ఇవ్వాలన్నారు.

రైతన్నకు వరం



కొత్తకోట శివారులో పొలం సాగు చేస్తున్న రైతు

- పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన అమలు
- 60 ఏళ్లు దాటిన వారికి పెన్షన్
- 18 నుంచి 40 ఏళ్లు ఉన్న వారు అర్హులు
- రూ.55 నుంచి ప్రీమియం మొదలు

కొత్తకోట రూరల్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం 'కిసాన్ మాన్‌ధన్ యోజన' పథకం రైతులకు వరంగా మారనుంది. వ్యవసాయం చేస్తున్న రైతులు వృద్ధాప్యంలో వచ్చాక వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ పథకాన్ని అమలుచేసింది. ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చింది. 60 ఏళ్ల నిండాక రైతులకు ప్రతి నెలా రూ.3వేల చొప్పున పెన్షన్ జీవిత కాలం అందుతోంది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూ రికార్డుల్లో తమ పేరు ఉండి, రెండు హెక్టర్ల వరకు సాగు చేసేందుకు వీలుగా భూమి ఉన్న వారు పేరు నమోదు చేసుకోవచ్చు. నేషనల్ పెన్షన్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్ పరిధిలో ఉన్నవారు ఇతర చట్టబద్ధ సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్నవారు, ఉన్నత ఆర్థికస్థితి కలిగిన వారు, ట్యాక్స్‌పేయర్లు ఈ పథకానికి అర్హులు కాదు. ఈ పెన్షన్ అందే వారు రైతులు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించిన తరువాత తనవంతుగా బీమా కంపెనీకి నగదు ప్రభుత్వం జమచేస్తుంది.

ప్రీమియం వివరాలు..

ప్రతినెలా రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. ప్రీమియం మొత్తానికి కేంద్రం సమానంగా చెల్లిస్తుంది. రూ.55 జమచేస్తే ప్రతినెలా రూ.110 జమవుతోంది. 20 ఏళ్ల వారికి రూ.80, 30 ఏళ్ల వారికి రూ.105, 35 ఏళ్ల వారికి రూ.150, 40 ఏళ్ల వయస్సు వారికి రూ.200 ఉంటుంది. రైతు మరణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 60 ఏళ్ల తరువాత రైతు మరణిస్తే భార్యకు రూ.1,500 పెన్షన్ వస్తుంది. రైతుఫొటో, నివాస ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, వయస్సు నిర్ధారణ పత్రం, సాగుభూమి, ఆదాయం వంటి వివరాలు పత్రాలను అందజేయాలి.

దరఖాస్తు చేసుకోవడం ఎలా ?

- లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్‌లో పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలి
- ఆధార్‌కార్డు నంబర్ నదు చేయాలి
- నమోదైన బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులను చెల్లించాలి. ప్రతినెలా యథావిధిగా ఖాతా నుంచి జమఅవతాయి.
- నామిని వివరాలను నమోదు చేయాలి
- దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని సంతకం చేసి పోర్టల్ అప్‌లోడ్ చేయాలి.
- వెంటనే పీఎం కిసాన్ మాన్‌ధన్ పెన్షన్ కార్డు జనరేట్ అవుతుంది.
- ప్రతినెలా బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు జమఅవతాయి.
- పీఎం కిసాన్ లబ్ధిదారులు కానట్లయితే సీఎస్‌సీలో మ్యానువల్‌గా దరఖాస్తు చేసుకుని పెన్షన్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం రైతులకోసం తీసుకొచ్చిన కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి. చాలా మంది ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ పనివేళల్లో వచ్చి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

– దామోదర్, ఏడీఏ, కొత్తకోట

ఎల్‌ఓసీ చెక్కు అందజేత

గోపాల్‌పేట: ఆపద సమయంలో బాధితులకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రానికి చెందిన చిన్నయ్య తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. విషయాన్ని నాయకులు శివకుమార్, వెంకటయ్య, రమేష్ ఉమ్మడి మండల ఇంచార్జి సత్యశీలారెడ్డి ద్వారా ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.2.50 లక్షలు మంజూరు చేయించారు. శనివారం చెక్కును పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ వెంకటేష్, వెంకటేష్, బాల్‌రాజు హైదరాబాద్‌లో చిన్నయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్ గ్రామానికి చెందిన నేనావత్ జ్యోతికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5లక్షల ఎల్‌ఓసీని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అందజేశారు. శనివారం మక్తల్‌లో జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీని అందజేశారు. ఇంకా వైద్యానికి కావల్సిన నిధులను సమకూరుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసిరాజ్, నల్గొండశ్రీను, దామోదర్, గంగ్యానాయక్, చాంద్ పాషా, అశోక్, సాయిరాఘవ తదితరులు ఉన్నారు.

డీసీఈబీగా మద్దిలేటి



వనపర్తి విద్యావిభాగం: జిల్లా డీసీఈబీ సెక్రటరీగా పదవీ బాధ్యతలు చేపట్టిన మద్దిలేటి జిల్లా ఉన్నత పాఠశాల బాలుర, ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శనివారం హెచ్‌ఎం గురురాజుయాదవ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దిలేటిని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సన్మానించారు.

ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ నిర్మించొద్దు

కొత్తకోట: పట్టణంలోని గణేశ్‌నగర్ కాలనీలో సెల్‌టవర్‌ను నిర్మించొద్దని కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ సైదయ్యకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. సెల్‌టవర్‌తో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అనారోగ్యపాలవుతారని నిర్మాణాన్ని నిలిపివేయాలని ప్రజలు వేడుకొంటున్నారు

మహిళాశక్తి సంబరాలకు తరలిన మహిళలు



అమరచింత(ఆత్మకూర్): మక్తల్‌లో జరిగిన ఇందిర మహిళాశక్తి సంబరాలకు అమరచింత నుంచి మహిళలు పెద్దఎత్తున తరలివెళ్లారు. శనివారం మండల మహిళా సమాఖ్యకు మంజూరైన ఆర్టీసీబస్సును ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఎం కృష్ణవేణి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆ బస్సులోనే మక్తల్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, సీసీలు తిరుపతమ్మ, బీసన్న, నిజాం తదితరులు ఉన్నారు.

యువకుడు అదృశ్యం



సయ్యద్ రహమత్

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్యాటగడ్డకు చెందిన సయ్యద్ రహమత్ ఈ నెల 18 నుంచి కనిపించడం లేదని అతడి భార్య గాయత్రి శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలో రహమత్ ఆటోడ్రైవర్ జీవనం సాగిస్తున్నాడన్నారు. శుక్రవారం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లాడని, తిరిగి రాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన మెజిస్ట్రేట్

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమాన్ని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఉపనిషాద్వని సందర్శించారు. వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలో వృద్ధులకు కల్పిస్తున్న వసతులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల నాగరాజు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

చట్టాలపై అవగాహన

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొల్లాపూర్ లోక్ అదాలత్ చైర్మన్, జూనియర్ జడ్జి దమ్ము ఉపనిషద్వని హాజరయ్యారు. ఈ సందరభంగా ఆమె మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.